సాక్షి
చిత్తూరు
మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



దేవుడా .. ఎవరిదీ పాపం?
అభం శుభం తెలియని బాలికను వంచించి, ఆమె మృతికి కారకులను శిక్షిం చాలని పలువురు కోరుతున్నారు. - 8లో



సమస్యలు.. వెల్లువెత్తిన వినతులు
కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పెద్దసంఖ్యలో వివిధ సమస్యలపై అర్జీలు వచ్చాయి. - 8లో



సర్వర్ సమస్య.. సహనానికి పరీక్ష
సదరం సర్టిఫికెట్లు పొందిన వారికి సైతం ప్రభుత్వం మరోమారు పరీక్ష పెడుతోంది. దివ్యాంగులను ఇబ్బంది పెడుతోంది. - 8లో

న్యూస్‌రీల్

ట్రాన్స్‌కో ఉద్యోగుల బదిలీకి చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉద్యోగుల బదిలీలను ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని సీఎండీ సంతోషరావు ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. తిరుపతి, చిత్తూరులోని ఎస్‌ఈ కార్యాలయాల పరిధిలో మొత్తం 55 మంది ఉద్యోగులను సర్దుబాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కమిటీలో సీజీఎం ఓఎస్‌ఎం, సీజీఎం రెవెన్యూ, ఆడిట్, తిరుపతి, చిత్తూరు ఎస్‌ఈ సభ్యులుగా ఉన్నారు. ఉద్యోగుల బదిలీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. తిరుపతి నుంచి చిత్తూరుకు బదిలీ చేసిన ఉద్యోగులు రెండు నెలలుగా దాగుడుమూతలు ఆడుతున్న విషయం తెలిసిందే. వీటిపై ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పుంగనూరులో దేవాంగపిల్లి



ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న దేవాంగపిల్లి

పుంగనూరు : స్థానిక డాన్‌బాస్కో పాఠశాల ఆవరణలో సోమవారం అరుదైన దేవాంగపిల్లి ప్రత్యక్షమైంది. స్కూలు సిబ్బంది సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు చేరుకుని దేవాంగపిల్లిని స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కిరణ్ కిషోర్ మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

22 నుంచి ప్రాజెక్టుల మహాసభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో 25శాతం నిధులు కేటాయించాలని కోరుతూ ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లా కడపలో ప్రాజెక్టుల మహాసభ నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు, నేత జనార్ధన్ వెల్లడించారు. సోమవారం చిత్తూరు సమీపంలోని హంద్రీ–నీవా కాలును సీపీఐ నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే హంద్రీ–నీవా ప్రాజెక్టుకు రూ.5వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే గాలేరు–నగరి, ఎస్ఎస్ కెనాల్ ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నిధులు పేర్కొనాలని కోరారు. రాయలసీమను నిర్లక్ష్యం చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ప్రాజెక్టు మహాసభకు పెద్దసంఖ్యలో రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, వీసీ గోపీనాథ్. మణి, దాసరి చంద్ర, విజయ్ కుమార్, విజయ గౌరి,, రమాదేవి, కుమారి, రఘు, లతా రెడ్డి, కవిత పాల్గొన్నారు.

గ్రామ కంఠం రక్షణకు వినతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మండలంలోని ఎగువమసాపల్లెలో కూటమి నేత నుంచి గ్రామ కంఠం భూమిని రక్షించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం ఈ మేరకు చిత్తూరు రూరల్ తహసీల్దార్ లోకేశ్వరికి వినతి పత్రం అందించారు. గ్రామ కంఠం భూమిని సదరు నేత ఆక్రమించుకుని గోకులం షెడ్డు నిర్మించారని, దీనిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. నకిలీ పత్రాలు సృష్టించి అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని వెల్లడించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తమను ఏం చేయలేరని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కబ్జాలను తొలగించాలని కోరారు.

సత్వర న్యాయమే లక్ష్యం



సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో విచారించి, బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. సోమవారం చిత్తూరులోని ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయంలో నిర్వహించిన పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో భూ వివాదాలు, మోసాలు, కుటుంబ తగాదాలు, వేధింపులు, ఆస్తి సమస్యలకు సంబంధించిన 33 ఫిర్యాదులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

● దేవాలయాల పరిరక్షణే లక్ష్యం



హాజరైన ఏపీ, గోవా, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

దేశంలోని అన్ని దేవాలయాల అనుసంధానం, పరిరక్షణే లక్ష్యంగా టెంపుల్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో అంత్యోదయ ప్రతిష్టాన్ సహకారంతో తిరుపతి మంగళంలోని ఆశా కన్వెన్షన్ వేదికగా సోమవారం ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్‌పో ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 19 వరకు జరగనున్న ఈ కార్యక్రమానికి గోవా, మహారాష్ట్ర, ఏపీ సీఎంలు ప్రమోద్ సావంత్, దేవేంద్ర పడ్నవీస్, చంద్రబాబు హాజరయ్యారు. 58 దేశాల్లోని సుమారు 1,581 దేవాలయాలను అనుసంధానించడం, భద్రతపై చర్చించారు. – తిరుపతి సిటీ

కక్షగట్టి వేధింపులు



బాధితులు ఇమ్రాన్, సుమియా

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పనిచేశానని కక్షగట్టి వేధిస్తున్నారని, దౌర్జన్యంగా మా షాపులకు తాళం వేశారని బాధితులు ఇమ్రాన్, సుమియా దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 2021లో చిత్తూరు వన్ డిపో పరిధిలోని ఓ ఖాళీ స్థలానికి టెండర్ దక్కించుకుని సొంత ఖర్చులతో షాపులు కట్టుకున్నామన్నారు. నిబంధనల ప్రకారం ముందస్తు డిపాజిట్ కింద రూ. 3లక్షల వరకు చెల్లించామని వెల్లడించారు. ఆ షాపుల మీదే ఆధారపడి కుటుంబీకులను పోషించుకుంటున్నామని చెప్పారు. అయితే నాలుగు నెలలుగా షాపు ఖాళీ చేయాలని ఆర్టీసీ డీపీటీఓ జగదీష్ ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. టెండర్ ప్రకారం 14 నెలల కాల పరిమితి ఉన్నప్పటికీ దుకాణానికి తాళం కూడా వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రశ్నిస్తే కూటమి పార్టీలకు చెందిన గోకుల్ తమ ఒత్తిడి తెస్తున్నారని డీపీటీఓ చెప్పారని మండిపడ్డారు. దీనిపై హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. తాము చెల్లించిన డిపాజిట్ డబ్బులను కూడా తిరిగి ఇచ్చేది లేదని బెదిరిస్తున్నారని వెల్లడించారు. షాపుల నిర్మాణానికి రూ.25లక్షలు వెచ్చించామని, ఇప్పుడు ఖాళీ చేసి వెళ్లమనడం దారుణమని వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

‘పరికరాలు’.. పడిగాపులు



పెనుమూరు మండలం పులికల్లు గ్రామానికి చెందిన ఇతడి పేరు మధు. నడుము కింది భాగం నుంచి వైకల్యంతో బాధపడుతున్నాడు. ఓ బ్యాటరీ ట్రై సైకిల్ అందిస్తే, బయట తిరిగి ఉపాధి అవకాశాలు పొందేందుకు వెసులుబాటు ఉంటుందని ఆశపడ్డాడు. ఈ మేరకు వెంటనే విభిన్న ప్రతిభావంతులశాఖ జిల్లా అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అర్జీ ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



చిత్తూరులోని జిల్లా శిక్షణ కార్యాలయం వద్ద తుప్పు పట్టి, శిథిలావస్థలో ఉన్న ట్రై సైకిళ్లు

- ప్రత్యేక ఉపకరణాల కోసం 8 నెలలుగా నిరీక్షిస్తున్న దివ్యాంగులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు
- ప్రభుత్వం నిర్లక్ష్యంతో విభిన్న ప్రతిభావంతుల అవస్థలు
- కనీసం మాత్రం పట్టించుకోని అధికారులు

వైకల్యంతో బాధపడుతూ బతుకుపోరు సాగించే వారిని విభిన్న ప్రతిభావంతులుగా పరిగణిస్తుంటారు. ప్రత్యేక అవసరాలు గల వీరు మరొకరిపై ఆధారపడకుండా కొన్ని పరికరాల సాయంతో దైనందిన కార్యకలాపాలు సాగిస్తుంటారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం సైతం బాధ్యతగా ట్రై సైకిళ్లు.. బ్యాటరీ వాహనాలతోపాటు పలు ఉపకరణాలను అందజేస్తూ ఉంటుంది. సమాజంలో ఎవరూ వీరిని చిన్నచూపు చూడకుండా చేయూతనందిస్తూ ఉంటుంది. అయితే కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులపై శీతకన్ను వేసింది. సుమారు ఎనిమిది నెలలుగా చిన్న పాటి చేతికర్రను సైతం మంజూరు చేయలేదు. వేలాది మంది దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడం లేదు.

చిత్తూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు మంజూరు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించింది. గంగాధరనెల్లూరు, చిత్తూరు, నగరి, పలమనేరు, పూతలపట్టు, కుప్పం ప్రాంతాల్లో క్యాంపులు చేపట్టింది. ఎవరెవరికి ఏయే ఉపకరణాలు కావాలో వినతులు ఇవ్వాలని కోరింది. దీంతో 4,697 మంది ప్రతిభా వంతులు ప్రత్యేక పరికరాల కోసం దరఖాస్తులు అందజేశారు. అయితే, ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఎలాంటి పరికరం అందించలేదు. ఈ క్రమంలో మండల కార్యాలయాల నుంచి కలెక్టరేట్ వరకు పరికరాల కోసం దివ్యాంగులు తిరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు జారీ చేసి, ఉపకరణాలు పంపితే తప్ప తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారు.

ఇంకెప్పుడు..?



మాకు ప్రత్యేక పరికరాల అవసరం ఏంటో ప్రభుత్వానికి తెలియదా..? జిల్లా మొత్తం వరసగా క్యాంపులు పెట్టారు. నాలుగు వేలకు పైగా దరఖాస్తులు వస్తే, వాటిని అధికారులు భద్రంగా దాచుకున్నట్లున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా, పరికరాలు ఇవ్వకుంటే ఎట్లా..? ఓ దివ్యాంగుడికి ట్రైసైకిల్ మంజూరు చేయించేందుకు ఏడీ చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా స్పందన లేదు. అయితే కార్యాలయం వద్ద ఉన్న ట్రైసైకిళ్లు తుప్పు పట్టిపోతున్నా పట్టించుకోవడం లేదు.

– కొణతం చంద్రశేఖర్, నిరుద్యోగ వికలాంగ సంఘం జేఏసీ అధ్యక్షుడు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి పెద్ద పీటవేసింది. కళ్లు కనిపించని వాళ్లకు ఫోల్డింగ్ స్టిక్స్, కాళ్లు పనిచేయని వాళ్లకు కర్రలు, పూర్తి వైకల్యంతో బాధపడే వాళ్లకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి సమస్యతో ఉన్న వాళ్లకు మిషన్లు, డిగ్రీ ఉత్తీర్ణులైన వాళ్లకు ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్లను పంపిణీ చేసింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు ఉమ్మడి జిల్లాలో ఎంపీలుగా పనిచేసిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప ద్వారా ఎంపీ నిధుల నుంచి దాదాపు రూ.12 కోట్లు విడుదల చేయించింది. సుమారు 32 వేల మంది విభిన్న ప్రతిభావంతులకు పరికరాలను అందించింది. కానీ, ప్రస్తుతం జిల్లాలో ప్రత్యేక అవసరాలున్న వారికి కనీసం చేతికర్ర కూడా అందకపోవడం గమనార్హం.

‘సదస్సు’ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిష్కరించిన ప్రతి అర్జీని ఆడిట్ చేస్తామన్నారు. ఎండార్స్‌మెంట్ విషయంలో వీఆర్‌ఓలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం మార్చి 8వ తేదీలోపు వినతులన్నీ పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం అనంతరం దరఖాస్తుదారులకు ఇంటి పట్టాలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓలు, పురపాలక కమిషనర్‌లు తమ పరిధిలోని బోర్లు, పంపుసెట్ల పరిశీలించి మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులను నిత్యం పరిశుభ్రం చేయించాలని సూచించారు. ఈ క్రమంలో 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఓ సుధాకర రావు, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరేనా.. నిధుల నివేదన?

కరువు మండలాల కల్పతరువైన హంద్రీ–నీవాకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందా..? అవసరాలకు తగ్గట్టు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందా..? అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటుందా..? జిల్లాకు సమృద్ధిగా కృష్ణా జలాలను తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తుందా..? పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతుందా..? తాగు.. సాగు నీటి కష్టాలను తీర్చేందుకు పెద్దపీట వేస్తుందా..? ఇవే ప్రశ్నలు జిల్లాలోని రైతులను వేధిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు గత పరిపాలన సరళిని పరిశీలిస్తే పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. తూతూమంత్రంగా నిధులు అందించి.. అరకొర పనులు చేపట్టిన విషయాలు గుర్తుకువస్తున్నాయి. ఈ పర్యాయమైనా పుష్కలంగా నిధులు కేటాయించాలని అన్నదాతల నుంచి విన్నపాలు వినిపిస్తున్నాయి.



పెద్దతిప్పసముద్రంలో పుంగనూరు ఉపకాలువకు లైనింగ్ పనులు

- హంద్రీ–నీవా ప్రాజెక్టుకు రూ.3,500 కోట్లు కేటాయించాలని ప్రతిపాదన
- ఉమ్మడి చిత్తూరు జిల్లాకే రూ.2 వేల కోట్లు అవసరం
- పెండింగ్ పనులకు రూ.729 కోట్లు తప్పనిసరి
- బడ్జెట్‌లో ప్రాధాన్యమివ్వాలని కోరుతున్న రైతాంగం

బి.కొత్తకోట : హంద్రీ–నీవా ప్రాజెక్టులోని ప్రధాన కాలువ, ఉప కాలువలు, రిజర్వాయర్లకు కృష్ణా జలాలు చేరాలంటే 2025–26 బడ్జెట్‌లో ఉదారంగా నిధులు కేటాయించాలి. ఈ మేరకు కూటమి ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తుందా లేక వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరు చేసిన నిధులనే పేర్కొని చేతులు దులుపు కుంటుందా అన్నది సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రాజెక్టును పూర్తి చేసి పొలాలకు కృష్ణా జలాలు అందిస్తారనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వంలో ఏనాడూ అవసరమైనంత నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. దీంతో పనులు ముందుకు సాగలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన అదనపు పనులను కూటమి ప్రభుత్వం కక్షగట్టి రద్దు చేసేసింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు నిధులుఇస్తారా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రతిపాదనలు పంపారు సరే..

హంద్రీ–నీవా ప్రాజెక్టు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ ఉమ్మడి జిల్లాల్లో సాగుతుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న, చేపట్టబోయే పనులకు రూ.3,500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు పంపారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో కాలువ వెడల్పు, కాంక్రీటు, మట్టి పనులను రూ.1,240 కోట్లతో చేపట్టారు. ఇవి కాక ప్రధాన కాలువకు సంబంధించి మరో రూ.503 కోట్లతో పనులు సిద్ధం చేశారు. ఈ మొత్తం పనులకే రూ.1,700 కోట్లు కావాలని నివేదించారు. ఇవి కాక కర్నూలు జిల్లాకు రూ.450 కోట్లు పోను, మిగిలిన రూ.1,350 కోట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనులను చేపట్టాల్సి ఉంటుంది.

ఆమోదం వచ్చేనా..?



తంబళ్లపల్లి నియోజకవర్గంలో ప్రధాన కాలువ దుస్థితి

విభజిత అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి ఇంచుమించు రూ.2 వేల కోట్లు అవసరమవుతాయి. అలాగే అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు రూ.729 కోట్లు కేటాయించాలని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ నిధుల్లో రూ.250 కోట్లతో ప్రధానకాలువపై చిన్నమండెం మండలం పడమటికోన, కలకడ వద్ద కాలువ తవ్వకం, 12 చోట్ల కాంక్రీటు నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి పూర్తి చేస్తే కానీ అడవిపల్లె, శ్రీనివాసపురం రిజర్వాయర్లకు కృష్ణా జలాలు వెళ్లవు. ఈ రూ.250 కోట్లకు ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చేనా అని రైతులు ఎదురుచూస్తున్నారు.

లైనింగ్‌కే రూ.684 కోట్లు

పుంగనూరు ఉపకాలువ వెడల్పు పనులను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం కాలువ లైనింగ్ పనులకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇందులో ప్రస్తుత అన్నమయ్య జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం నుంచి చిత్తూరు జిల్లాలోని పెద్దపంజాణి మండలం వరకు పుంగనూరు ఉపకాలువకు లైనింగ్ పనులను రూ.480 కోట్లతో, పెద్దపంజాణి నుంచి కుప్పం వరకు కుప్పం ఉప కాలువకు రూ.204 కోట్లతో లైనింగ్ పనులను చేపట్టారు. ఇది కాక కుప్పం కాలువకు సంబంధించి ఇంకా రూ.59 కోట్ల పనులు జరగాల్సి ఉంది. ప్రభుత్వం చెబుతున్నట్టు ఆరునెలల్లో ఈ లైనింగ్ పనులు పూర్తి కావాలంటే బడ్జెట్‌లో అందుకు తగ్గట్టు నిధులు కేటాయించాలి. కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పానికి రూ.535 కోట్లతో యామిగానిపల్లె వద్ద 0.7 టీఎంసీలు, మాదనపల్లె వద్ద 0.3 టీఎంసీలతో రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని బడ్జెట్‌లో అనుమతి ఇస్తారో లేదో చూడాల్సి ఉంది.

ఐసీడీఎస్‌లో రేపటి నుంచి ఇంటర్వ్యూలు

చిత్తూరు కలెక్టరేట్ : ఐసీడీఎస్ శాఖలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19, 20 వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పీడీ వెంకటేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మిషన్ వాత్సల్య పథకం కౌన్సిలర్, అవుట్‌రిచ్ వర్కర్ పోస్టు ఉద్యోగాలను ఈ నెల 19న , మిషన్ శక్తి పథకంలో ఖాళీగా ఉన్న పోస్టులకు 20 న ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. పోస్టుల వారీగా అర్హత పొందిన అభ్యర్థుల వివరాలను www.chittoor.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసినట్లు వివరించారు. అభ్యర్థులు ఒరిజనల్ గుర్తింపు కార్డు, విద్యార్హత సర్టిఫికెట్‌లు, అనుభవం, కుల ధ్రువీకరణపత్రాలతో కలెక్టరేట్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

పరిశోధనలో పరస్పర సహకారం

తిరుపతి సిటీ: పరిశోధనలో ఎస్వీయూ, అమెరికాలోని పార్డు యూనివర్సిటీ పరస్పర సహకారం అందించుకోనున్నట్లు యూఎస్‌ఏ ప్రతినిధి జూలియానా కస్తవస్ తెలిపారు. ఆమె సోమవారం ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాన్ని సందర్శించారు. ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాద్ రాజు, ఇతర ప్రొఫెసర్లతో ఆమె సమావేశమయ్యారు. గతంలో వర్సిటీతో తమ యూనివర్సిటీ ఎంఓయూ చేసుకుందనీ, ఈ ప్రకారం బోధన, పరిశోధన విషయాల్లో పరస్పరం సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం జూలియానా కస్తవస్‌ను ఫిజిక్స్ అధ్యాపకులు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు విజయలక్ష్మి, అపర్ణ, రుద్రమదేవి పాల్గొన్నారు

దేవుడా.. ఎవరిదీ పాపం?

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు.. బండపని చేసుకుంటూ పొట్టపోసుకునే బడుగులు.. ఏ పూటకు ఆ పూట కూలి తెచ్చుకుని జీవనం సాగించే నిరుపేదలు.. అష్టకష్టాలు పడుతున్నా తమ నలుగురు పిల్లలను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. అందులో ఓ ఆడబిడ్డకు పెళ్లి చేశారు. మరో అమ్మాయిని పదోతరగతి, అబ్బాయిని ఏడోతరగతి, మూడో కుమార్తెను రెండో తరగతి చదివిస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ సాఫీగానే సంసారం నెట్టుకొస్తున్నారు. ఇంతలో ఆ పేద కుటుంబంపై పిడుగు పడింది. వారి జీవితాలను అల్లకల్లోలం చేసేసింది.

- బిడ్డకు జన్మనిచ్చి కన్నుమూసిన బాలిక
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబీకులు
- బాధ్యులను శిక్షించాలంటున్న గ్రామస్తులు


బాధితుల ఇల్లు

పలమనేరు : మండలంలోని టి. వడ్డూరు గ్రామంలో బండపని చేసుకుని బతికే దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్దమ్మాయికి పెళ్లి చేశారు. మిగిలినవారు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో రెండో బిడ్డకు కడుపు ముందుకొస్తోందని టీచర్లు చెప్పడంతో ఆందోళన చెందారు. కామెర్ల వల్ల అలా జరిగిందేమో అని పట్టించుకోలేదు. తర్వాత బాలికకు కడుపునొప్పి అసలు విషయం తెలిసింది. ఆ బిడ్డ గర్భం దాల్చిందని తెలిసి బంగారుపాళెంలోని సోదరి ఇంటికి పంపేశారు. అక్కడే ఓ ప్రైవేట్ వైద్యుడికి చూపించారు. అయితే ఆ అమ్మాయికి ఫిట్స్ రావడంతో మూడురోజుల క్రితం చిత్తూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ సిజరేయన్ చేసి శిశువును బయటకి తీశారు. ఉన్నట్టుండి తల్లీబిడ్డల పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్సపొందుతూ ఆ బాలిక మృతిచెందింది. ఆ శిశువు ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.


విలపిస్తున్న బాలిక తల్లి

గ్రామంలో నిరసనలు

ఇలా ఉండగా తిరుపతి నుంచి బాలిక మృతదేహం అంబులెన్స్‌లో రాగానే గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. బాలిక మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ ధర్నాకు దిగారు. బాధితులకు న్యాయం చేస్తామని, దోషులను కఠినంగా శిక్షిస్తామని పలమనేరు సీఐ నరసింహరాజు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కారణం ఆ ముగ్గురే..

తన అక్క మృతికి ముగ్గురు యువకులు కారణమని చెల్లెలు వెల్లడించింది. తమ బంధువైన ఓ మహిళ కారణంగా తమ ఇంటికి తల్లిదండ్రులు లేని సమయంలో యువకులు వచ్చేవారని తెలిపింది. తరచూ బిరియానీ, ఇతర తినబండారాలను అక్కకు ఇచ్చేవారని వివరించింది.

కఠినంగా శిక్షించాలి



మైనర్ బాలికపై లైంగిక దాడి చేసి గర్భం దాల్చేలా చేసి, ఆమె మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి. తొమ్మిదినెలలు తన కడుపులో బిడ్డను మోస్తున్నా ఏ డాక్టరైనా ఎందుకు గుర్తించలేదు. ఇది వైద్యులు నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. గతంలోనూ ఈ గ్రామంలో ఇలాంటి ఘటనలు జరిగాయి. అప్పట్లో నిందితులను కఠినంగా శిక్షించి ఉంటే ఇప్పుడు ఇలాంటివి జరిగేవి కావు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలి.

– భువనేశ్వరి, ఐద్వా జిల్లా కన్వీనర్

క్లుప్తంగా

నిందితుడి అరెస్ట్‌కు డిమాండ్


రోడ్డుపై బైఠాయించిన దళిత నేతలు

పుంగనూరు : మండలంలోని వనమలదిన్నె పంచాయతీ అప్పిగానిపల్లెలో చిన్నమ్మ అనే మహిళను కులం పేరుతో దూషించిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని మాల మహానాడు, మాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు అంబేడ్కర్ కూడలిలో ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మేకంజామనపల్లెకి చెందిన నిందితుడు రాజానాయుడుపై పోలీసులు తూతూమంత్రంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చేతులు దులిపేసుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో దళితుల ప్రాణాలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ శ్రీనివాసులు ఘటనాస్థలానికి చేరుకుని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు ఎస్.అశోక్, శ్రీనివాసులు, జేవీ నాగరాజారెడ్డి, ఆనంద, ఆంజప్ప, వెంకటరమణ పాల్గొన్నారు.

చెరువులో పడి రైతు మృతి


లోకనాథనాయుడి మృతదేహం

తవణంపల్లె : మండలంలోని తెల్లగుండ్లపల్లెలో పాడి ఆవును చెరువులో కడుగుతూ అదుపుతప్పి పడిపోయి రైతు మృతి చెందినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన అన్నదమ్ములు లోకనాథనాయుడు(46), ప్రభాకర్‌నాయుడు తమ పశువులను కడిగేందుకు చెరువుకు సోమవారం తీసుకెళ్లారు.. ప్రభాకర్‌నాయుడు పశువును కడిగి ఇంటికి వెళ్లిపోయాడు. లోకనాథనాయుడు ఆవును కడుగుతుండగా అది చెరువు మధ్యలోకి వెళ్లింది. ఆవును పట్టుకొనే క్రమంలో నీటిలో మునిగి మరణించాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య వరకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పుంగనూరు : సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. మండలంలోని నల్లగుట్లపల్లెతాండాకు చెందిన గిరిబాబు సారా తరలిస్తుండగా నల్లగట్లపల్లితాండా సమీపంలో దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు వెల్లడించారు. నిందితుడి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

అనుమానిత పెరాలసిస్ కేసు గుర్తింపు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని చవటపల్లె పీహెచ్‌సీ పరిధిలో సోమవారం ఏఎఫ్‌బీ(అక్యూట్ ఫాల్సీ పెరాలసిస్) అనుమానిత కేసును జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. అందిన సమాచారం మేరకు.. డీఐఓ హనుమంతరావు ఆ ప్రాంతంలో ఆకస్మికంగా ఇంటింటా పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో ఓ అనుమానిత కేసు బయటపడింది. ఆ కేసు మలం శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం తమిళనాడులోని చెన్నైకి పంపారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు.

భవనంపై నుంచి పడి యువకుడి మృతి

కుప్పం : పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద నిర్మిస్తున్న భవనంపై నుంచి సోమవారం ప్రమాదశాత్తు జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. కొత్తయిండ్లు గ్రామానికి చెందిన మురుగేష్(25) పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మూడంతస్తుల భవనంలో పనిచేస్తుండగా కాలుజారి కిందపడ్డాడు. ఈ క్రమంలో గుడుపల్లె మండలం చీకటిపల్లెకు చెందిన బాలాజీ మురుగేష్‌ను కాపాడేందుకు యత్నించగా ఇద్దరు కింద పడ్డారు. మురుగేష్ అక్కడికక్కడే మృతి చెందగా, బాలాజీ తీవ్రంగా గాయపడి పీఈఎస్ మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యంత్రం.. 'పచ్చ'తంత్రం


జేసీబీతో చేయిస్తున్న ఉపాధి పనులు


గుడిముందర గుట్ట వద్ద తవ్వుతున్న ఫారంపాండ్


నల్లగట్టుచేనులో తవ్విన ఫారంపాండ్

పల్లె ప్రాంతాల్లో పేదలకు పని కల్పించాలి.. వలసలు నివారించాలి.. కూలీల జీవితాలకు భరోసా అందించాలి.. ఇదే లక్ష్యంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించారు. ఈ మేరకు రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులకు చేయూతనందిస్తున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం బడుగుల నోటి కాడ ముద్దను లాగేసుకుంటున్నారు. జేసీబీలతో ఉపాధి పనులు చేయించేస్తున్నారు. బినామీ కూలీల పేరుతో యథేచ్ఛగా నిధులు బొక్కేస్తున్నారు. అందులో భాగంగా శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ రెడ్లపల్లి సమీపంలోని గుడిముందరి గుట్ట వద్ద సోమవారం జేసీబీతో ఫారంపాండ్ తవ్వకం చేపట్టారు. గోవిందపల్లె–తుమ్మిశి ప్రధాన రహదారి పక్కన దర్జాగా యంత్రాలతో ఉపాధి పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలోనే నల్లగట్టుచేనులో మరో ఫారంపాండ్‌ను ఇప్పటికే జేసీబీతో తవ్వించేశారు. అధికారులు, సిబ్బందిని మామూళ్ల మత్తులో జోకొట్టి ఇష్టారాజ్యంగా ఉపాధి నిధులను దోచుకుంటున్నారు. – శాంతిపురం

చేయూత కోసం.. చిన్నారి ప్రాణం


కాలిన గాయాలతో రక్ష

వి.కోట : దాతల సాయం కోసం ఓ చిన్నారి ఎదురుచూస్తోంది. బిడ్డ ప్రాణం కాపాడాలని ఓ తండ్రి వేడుకోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాలు.. వి.కోట మండలం గాండ్లపల్లె గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె రక్ష(8)కు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని శరీరం చాలా వరకు కాలిపోయింది. వేలూరు సీఎంసీలో చిన్నారికి చికిత్స అందిస్తున్నారు. వైద్యానికి దాదాపు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. దీంతో దాతల సాయం కోసం బాధిత తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. మనసున్న వారు ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు దుర్గాప్రసాద్ నంబర్ 8618134582కు సాయం అందించాలని విన్నవిస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో రద్దీ సాధారణంగా ఉంది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు స్వామి వారి సర్వదర్శనం సుమారు 8 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. ఆదివారం అర్ధరాత్రికి 79,705 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 24,836 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.67కోట్లుగా అధికారులు తెలిపారు.

సమస్యలు.. వెల్లువెత్తిన వినతులు

- కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 248 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సోమవారం కలెక్టరేట్‌కు వివిధ సమస్యలతో ప్రజలు తరలివచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా అర్జీలు అందించారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్ఓ మోహన్‌కుమార్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ అధికారులు మాట్లాడుతూ వివిధ సమస్యలపై మొత్తం 248 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు.

బస్‌షెల్టర్ నిర్మాణం కోసం..



బస్‌షెల్టర్ నిర్మించాలని ఐరాల మండలం పొలకల గ్రామం అగ్రహారంపల్లె దళితవాడ వాసులు విన్నవించారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో విద్యార్థులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

'గేటు' వసూలుపై ఆవేదన



నగరి మున్సిపాలిటీ పరిధిలో గేటు రుసుము కింద రోజూ రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 400 మంది ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆటో డ్రైవర్ల నుంచి ప్రతి రోజు రూ.30 వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి గేటు వసూలు లేదన్నారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

మెయిన్ సెంటర్లుగా మార్చండి



జిల్లాలోని అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. 2019 నుంచి నేటి వరకు అంగన్‌వాడీ కార్మికుల జీతాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘ నాయకులు సుజిని, మమత పాల్గొన్నారు.

6. కూలీలకే ఉపాధి పనులు



జిల్లాలో ఉపాధి హామీ పనులను కూలీలకే ఇవ్వాలని, కాంట్రాక్టర్లకు కేటాయించకూడదని వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మనోహర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రజనీకాంత్‌ల కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి పనులను ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలతో చేయించకూడదని పేర్కొన్నారు. గ్రామ సభలో ఆమోదించిన పనులు మాత్రమే చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సభల తీర్మానాలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఉపాధిలో అవకతవకలు జరిగితే డ్వామాపీడీ, జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓలు, పీఓ, ఏపీఓలు బాధ్యత వహించాల్సి వస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మధుసూదన్, ప్రమీలమ్మ, ధనలక్ష్మి, మోహన్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు ప్రతిమారెడ్డి, యోవాన్, ఎంపీపీ సురేష్, పార్టీ గుడిపాల మండల అధ్యక్షుడు ప్రకాష్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం కోసం..



తమ గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరుతూ తవణంపల్లె మండలం దిగువ మొదలపల్లె, మాదిగపల్లె వాసులు గోవిందప్ప, రమణ కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమ గ్రామాల్లో దాదాపు 200 కుటుంబాలు, 25 డ్వాక్రా సంఘాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఏవైనా సమావేశాలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందిగా ఉందని తెలిపారు.

సీఎం చంద్రబాబుకు సాదర స్వాగతం


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): అంతర్జాతీయ దేవాలయాల కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సాదర స్వాగతం లభించింది. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఈఓ శ్యామలరావు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం, కురుగొండ్ల రామకృష్ణ, భాను ప్రకాష్, మురళీమోహన్, డా.వీయం. థామస్, మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన తిరుపతికి రోడ్డు మార్గాన పయనమయ్యారు.

సీఎంకు సాదర వీడ్కోలు

రేణిగుంట విమానాశ్రయంలో సీఎం చంద్రబాబునాయుడుకు సాదర వీడ్కోలు లభించింది. మంత్రితోపాటు టీటీడీ ఈఓ ఇతర అధికారులు ఆయనకు వీడ్కోలు పలికారు.

అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి

తిరుమల: ముంబైలో అమ్మవారి ఆలయం, టీటీడీ సమాచార కేంద్రాన్ని నిర్మించేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ద్వారా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం తిరుపతిలో ఆయనను కలసి విన్నవించారు. ఇప్పటికే నవీ ముంబైలో ఉల్వే ప్రాంతంలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం 3.61 ఎకరాల స్థలాన్ని లీజు ప్రాతిపదికన కేటాయించారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మరో 1.5 ఎకరాల స్థలంలో అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించాలని టీటీడీ నిర్ణయించిందని, ఈ మేరకు స్థలాన్ని కేటాయించాలని, బాంద్రాలో టీటీడీ సమాచార కేంద్రానికి కొంత స్థలాన్ని కేటాయించాలని టీటీడీ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

సర్వర్ సమస్య.. సహనానికి పరీక్ష!


కుర్చీలు 20.. వికలాంగులు 150 మంది.. ఇదీ పరిస్థితి

తిరుపతి తుడా: దివ్యాంగులకు ప్రభుత్వం మరో మారు పరీక్ష పెడుతోంది. వైకల్యంతో అవస్థలు పడుతున్నారనే కనికరం కూడా లేకుండా వేధిస్తోంది. పింఛన్ సొమ్ముతో పొట్ట పోసుకొనే వారి ఆత్మాభిమానం పై దాడి చేస్తోంది. పింఛన్‌దారుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా వ్యూహం రచిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ వైద్యుల చేత సదరం సర్టిఫికెట్లను పొంది వారికి మరోమారు పరీక్ష పెడుతోంది. గడిచిన నెల రోజులుగా వారంలో తొలి మూడు రోజులు సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ నిర్వహిస్తోంది. వ్యయ ప్రయాసలకోర్చి మరోమారు తమ వైకల్యాన్ని నిరూపించుకునేందుకు లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. దీంతో తిరుపతి రుయా ఆస్పత్రి కిక్కిరిసిపోతోంది.

వసతుల ఏర్పాట్లలో నిర్లక్ష్యం

సదరం ఫ్రీ వెరిఫికేషన్ కోసం రోజుకు 150 నుంచి 200 మంది దివ్యాంగులు రుయా ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. అయితే దివ్యాంగులకు కనీస వసతులను కల్పించడంలో ప్రభుత్వం చేతులెత్తేసింది. సదరం రీ వెరిఫికేషన్ క్యాంపుల పర్యవేక్షణ బాధ్యతలను డీఆర్డీఏకు ప్రభుత్వం అప్పగించింది. ఆ శాఖ అధికారులు ఆటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఒక షామియానా, 20 కుర్చీలు వేసి చేతులు గెలుపుకున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దివ్యాంగులు అక్కడే ఉండాల్సి వస్తోంది. కనీసం తాగునీటి సౌకర్యాన్ని కూడా కల్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి విధులు కోసం వచ్చిన డాక్టర్ల పట్ల కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వారికి వసతి, ట్రాన్స్‌పోర్ట్, భోజన సౌకర్యాలను కల్పించకపోవడం వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతోంది.

గంటల తరబడి నిరీక్షణ

సదరం వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులకు నిరీక్షణ తప్పడం లేదు. కొన్ని సమయాల్లో సర్వర్ మొరాయిస్తుండడంతో రీ వెరిఫికేషన్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. సౌకర్యాల లేమి, నిరీక్షణతో మరింత వేదనకు గురవుతున్నారు.